సాక్షి
జోగులాంబ గద్వాల

శుక్రవారం। 25। ఆగస్టు। 2023



నెట్టెంపాడుకు నీటి పంపింగ్

జూరాల నుంచి నెట్టెంపాడు ఎత్తిపోతలకు ఒక పంపు ద్వారా 750 క్యూసెక్కులు వదిలారు.

వివరాలు 8లో ▸



విద్యుత్ కోతలపై ఆగ్రహం

అనధికారికంగా విద్యుత్ కోతలు విధించడం పై అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
35.6 /24.3

వాతావరణం

రోజంతా ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతం అవుతుంది. మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

పాలమూరులో కలకలం

గద్వాల ఎమ్మెల్యే 'బండ్ల'పై అనర్హత వేటు

- రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం తీర్పు
- 2018 ఎన్నికల్లో తప్పుడు అఫిడవిట్ దాఖలు చేశారని అభియోగం
- డీకే అరుణను ఎమ్మెల్యేగా ప్రకటించాలని ఆదేశాలు
- బీఆర్ఎస్ శ్రేణుల్లో ఆందోళన.. బీజేపీలో హర్షాతిరేకాలు
- మొన్న వనమా.. ఇవ్వాళ బండ్ల.. ఇప్పట్లో తేలేదేమీ లేదని రాజకీయ వర్గాల్లో చర్చ





సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డిపై అనర్హత వేటు ఉమ్మడి పాలమూరును కుదిపేస్తోంది. 2018 ఎన్నికల్లో ఎలక్షన్ కమిషన్‌కు తప్పుడు అఫిడవిట్ దాఖలు చేశారని మాజీ మంత్రి డీకే అరుణ దాఖలు చేసిన పిటిషన్‌పై రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం గురువారం తీర్పు వెలువరించింది. అంతేకాదు.. ఆ ఎన్నికల్లో రెండోస్థానంలో నిలిచిన ఆమెను ఎమ్మెల్యేగా ప్రకటించాలని ఆదేశాలు జారీ చేయడం సంచలనం సృష్టిస్తోంది. ఈ పరిణామాలతో అధికార పార్టీ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల్లో ఆందోళన నెలకొనగా.. బీజేపీ శ్రేణులు సంబరాల్లో మునిగాయి. అయితే అఫిడవిట్‌లో తప్పుడు సమాచారం ఇచ్చారని.. పలు ఆస్తుల వివరాలు ఇవ్వకుండా దాచిపెట్టారని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వర్‌రావుపై దాఖలైన అభియోగంపై హైకోర్టు ఇలాంటి తీర్పే ఇవ్వగా.. ఆయన సుప్రీం నుంచి స్టే తెచ్చుకున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో వీరిపై ఇప్పట్లో తేలేదేమీ లేదనే చర్చ రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది.

పిటిషనర్ పేర్కొన్న అంశాలు..

- ➤ వీవీ ప్యాట్‌లో ఏ ఓటు వేసినా టీఆర్ఎస్ అభ్యర్థికే పడుతోందంటూ..
- ➤ పూడూరు సమీపంలో గోదాంల విషయాన్ని ఎన్నికల అఫిడవిట్‌లో దాచిపెట్టారని..
- ➤ ఒక కారుకు చాలన్ కట్ట లేదని.. మరో వాహనాన్ని చూపించలేదని..

గద్వాలలో 2018 ఎన్నికల ఫలితాలు ఇలా..

బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి (బీఆర్ఎస్)	1,00,415
డీకే అరుణ (కాంగ్రెస్)	72,155
మెజార్టీ	28,260

న్యాయమే గెలిచింది.. ప్రజలదే అంతిమ నిర్ణయం

తాజా పరిణామాల క్రమంలో కోర్టుతీర్పు అనంత రం డీకే అరుణ రాత్రి గద్వాలకు వచ్చారు. ఈ క్ర మంలో బీజేపీ శ్రేణులతో బంగ్లా పరిసరాల్లో సంద డి నెలకొంది. ఈ సందర్భంగా ఆమెకు బీజేపీ నా యకులు, కార్యకర్తలు బాణసంచాలు కాల్చి, స్వీట్లు పంచుతూ ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎప్పటికై నా న్యాయానిదే గెలుపు. ఎన్నికల అఫిడవిట్‌లో తప్పుడు వివరాలు ఇచ్చి.. అడ్డదారిలో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాడు. దీనిపై హైకోర్టును ఆశ్రయించగా.. న్యాయమే గెలిచింది' అన్నారు. కాగా, హైకోర్టు తీర్పు అనంతరం సాయంత్రమే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి హైదరాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు. 'ప్రజాస్వామ్యంలో ప్రజల తీర్పే అంతిమం.. కొందరికి ప్రజాస్వామ్యంపై విశ్వాసంలేక దొడ్డిదారి రాజకీయాలు చేస్తున్నారు. సుప్రీంకోర్టులో తీర్పు తనకు అనుకూలంగా వస్తుందనే నమ్మకం ఉంది' అని పేర్కొన్నారు.

అసలేం జరిగింది..

గత సాధారణ ఎన్నికల్లో (2018 డిసెంబర్) గద్వాల నియోజకవర్గం నుంచి మొత్తం 14 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. ప్రధానంగా బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్యే పోటీ జరిగింది. అప్పటి టీఆర్ఎస్ (ప్రస్తుత బీఆర్ఎస్) నుంచి బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, కాంగ్రెస్ నుంచి మాజీ మంత్రి డీకే అరుణ తలపడ్డారు. కృష్ణమోహన్‌రెడ్డికి 1,00,415 ఓట్లు రాగా.. అరుణకు 72,155 ఓట్లు వచ్చాయి. 28,260 ఓట్ల మెజార్టీతో కృష్ణమోహన్‌రెడ్డి గెలుపొందారు. ఆ తర్వాత రాజకీయ పరిణామాల క్రమంలో డీకే అరుణ కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరారు. అయితే ఎన్నికల సమయంలో కృష్ణమోహన్‌రెడ్డి సమర్పించిన అఫిడవిట్‌లో పూర్తి వివరాలు లేవంటూ పలు అంశాలపై 2019లో డీకే అరుణ హైకోర్టును ఆశ్రయించారు. అప్పటి నుంచి కోర్టులో కేసు నడుస్తుండగా.. గురువారం తీర్పు వెలువడింది. బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఎన్నిక చెల్లదని.. రెండో స్థానంలో నిలిచిన డీకే అరుణను ఎమ్మెల్యేగా ప్రకటించాలని.. పిటిషనర్‌కు కోర్టు ఖర్చుల కింద కృష్ణమోహన్‌రెడ్డి రూ.50వేలతో పాటు జరిమానాగా రూ. 2.50 లక్షలు చెల్లించాలని ఆదేశాలు జారీ చేసింది. అయితే ఈ ఎన్నికల పిటిషన్‌పై బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి కౌంటర్ దాఖలు చేయలేదని ఆయన గురువారం హైదరాబాద్‌లో విలేకరుల సమావేశంలో వెల్లడించిన అంశాలను బట్టి తెలుస్తోంది. ఈ కేసుకు సంబంధించి తనకు కోర్టు నుంచి ఎలాంటి నోటీసులు రాలేదని.. ఇటీవలే తెలిసిందని.. అప్పటికే తీర్పు రిజర్వ్ కాగా.. ఈ రోజు సామాజిక మాధ్యమాల ద్వారా జడ్జి తీర్పు వెల్లడించినట్లు తెలిసిందన్నారు. హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టును ఆశ్రయించనున్నట్లు వెల్లడించారు.



గద్వాలలో డీకే అరుణకు స్వాగతం పలుకుతున్న కార్యకర్తలు

డీకే X బండ్ల

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: సొంత మేనల్లుడే **ప్రత్యర్థిగా మారి** సవాళ్లు, ప్రతి సవాళ్లు విసురుకునే స్థాయిలో **వారి మధ్య** రాజకీయ వైరం ఏర్పడింది. ప్రస్తుతం బండ్ల **కృష్ణమోహన్**‌రెడ్డి ఎమ్మెల్యే ఎన్నికపై హైకోర్టు తీర్పు సం**చలనం రేప**గా.. డీకే వర్సెస్ బండ్ల మధ్య నెలకొన్న రాజకీయ వైరం ఉమ్మడి పాలమూరు జిల్లాలో హాట్‌టాపిక్‌గా మారింది. మాజీ ఎమ్మెల్యే డీకే భరత్‌సింహారెడ్డికి సొంత అక్క కొడుకే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి. డీకే భరత్ సింహారెడ్డి 1994లో ఎమ్మెల్యేగా గెలుపొందిన తర్వాత మేనల్లుడైన బండ్ల కృష్ణమోహన్‌రెడ్డిని చేరదీశారు. ఈ క్రమంలో ఆయన అటు రాజకీయంగా, ఇటుఅధికార వ్యవహారాల్లో అన్నీ తానై చక్రం తిప్పారు. ఒకానొక దశలో గద్వాలలో షాడో ఎమ్మెల్యేగా వ్యవహరిస్తు న్నాడనే గుసగుసలు సైతం విన్పించాయి. అయితే 1999లో గద్వాల పట్టణంలో కరాటే శ్రీను హత్య రాష్ట్రంలో సంచలనం సృష్టించగా.. రాజకీయ దుమారం చెలరేగింది. 1999లో శాసనసభ ఎన్నికల్లో గట్టు భీముడి చేతిలో డీకే భరత్‌సింహారెడ్డి భార్య డీకే అరుణ ఓటమిపాలు కాగా.. రాజకీయ పరిణామాలు చకచకా మారిపోయాయి. తన ఓటమికి బండ్ల కృష్ణమోహన్‌రెడ్డే కారణమని భావించి.. డీకే కుటుంబం ఆయనను రాజకీయాల నుంచి దూరం పెట్టడంతో విభేదాలు చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది.

2004లో వేరుకుంపటి..

తన ప్రాబల్యం తగ్గించారనే భావనతో ఉన్న కృష్ణమోహన్‌రెడ్డి తనకంటూ ప్రత్యేక వర్గాన్ని తయారు చేసుకున్నారు. 2004లో డీకే అరుణ ఎమ్మెల్యేగా గెలుపొందిన అనంతరం ఇరువురి మధ్య విభేదాలు తారస్థాయికి చేరగా.. డీకే బంగ్లాతో విభేదించిన కృష్ణమోహన్‌రెడ్డి వేరే కుంపటి పెట్టుకున్నారు. 2005లో టీడీపీ నుంచి గద్వాల మండల జెడ్పీటీసీ స్థానానికి బండ్ల పోటీ చేశాడు. డీకే వర్గం నిలబెట్టిన అభ్యర్థి తిరుమల్‌రెడ్డిపై గెలుపొందారు. అక్కడి నుంచి రాజకీయంగా అంచెలంచెలుగా ఎదిగిన ఆయన 2009 అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ నుంచి ఎమ్మెల్యేగా బరిలో నిలిచారు. తన అత్త అయిన కాంగ్రెస్ అభ్యర్థి డీకే అరుణపై పోటీ చేసి.. ఆమె చేతిలో ఓటమి పాలయ్యారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనంతరం 2014లో జరిగిన ఎన్నికల్లో మరోసారి టీఆర్ఎస్ టికెట్ మీద డీకే అరుణపై పోటీ చేసి రెండోసారి ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత గత ఎన్నికల్లో డీకే అరుణతో తలపడి.. 28,260 ఓట్ల తేడాతో గెలుపొంది ఎమ్మెల్యే అయ్యారు. తాజా పరిణామాల నేపథ్యంలో వారి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే స్థాయిలో మరింత వైరం ముదిరే అవకాశాలు ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

న్యూస్‌రీల్

ఇళ్ల పరిశీలన



శాంతినగర్: ప్రభుత్వ భూముల్లో నిర్మించుకున్న ఇళ్లను, వాటి కొలతలను జిల్లా పంచాయతీ అధికారి శ్యాంసుందర్ గురువారం పరిశీలించారు. ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకున్న నిరుపేదలు జీవో నంబర్ 59 ప్రకారం పట్టా చేయించుకునేందుకు మీసేవల్లో దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది. వివిధ ఆధారాలతో దరఖాస్తు చేసుకున్న వారి ఇళ్లను డీపీఓ, సర్వేయర్ హరికృష్ణ, ఎంపీఓ తిరుపతన్న పరిశీలించారు. వడ్డేపల్లి గట్టుపై పది ఇళ్లు, కొంకలలో మరో ఇంటిని డీపీఓ, అధికారులు కొలతలు తీసుకున్నారు. ఇళ్లకు సంబంధించిన ఇంటిపన్ను రశీదులు, విద్యుత్ బిల్లులు పూర్తి వివరాలు సేకరించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్మించుకున్న ఇళ్లకు పట్టాలు ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు.

జాబ్‌మేళాకు స్పందన

గద్వాల అర్బన్: జిల్లా ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో పీఎంకేకే వారి సహకారంతో గురువారం జిల్లా కేంద్రంలోని ఏంఏఎల్‌డి డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించారు. వివిధ కంపెనీల ప్రతినిధులు అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ జాబ్‌మేళాకు 200మంది అభ్యర్థులకు హాజరయ్యారు. ఎంపికైన అభ్యర్థులకు సమాచారం అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కళాశాల ప్రిన్సిపాల్ శ్రీపతినాయుడు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పనశాఖ అధికారిణి ప్రియాంక, కళాశాల భౌతిక విభాగధిపతి లవీన మంజులత, పిఎంకేకే అనిమిరెడ్డి తదితరులు ఉన్నారు.

బీజేపీ నాయకుల సంబరాలు

గద్వాల రూరల్: గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఎన్నిక చెల్లదని పేర్కొంటూ డీకే అరుణను ఎమ్మెల్యేగా ప్రకటిస్తూ హైకోర్టు తీర్పు వెలువర్చిన నేపథ్యంలో గురువారం గద్వాలలో బీజేపీ శ్రేణులు, నాయకులు సంబరాలు చేసుకున్నారు. బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచి పెట్టారు. గద్వాలకు చేరుకున్న డీకే అరుణను పార్టీ నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలుపుతూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈసందర్భంగా ఆమెకు పుష్పగుచ్ఛాలు, శాలువలతో సన్మానించారు. హైకోర్టు తీర్పుతో పార్టీ కార్యాలయ పరిసరాల్లో పండుగ వాతావరణం నెలకొంది.

పంటలకు నీరందించకుంటే ఆందోళన



అలంపూర్ రూరల్: నదిలో నీరు, కమిటీలో రూ.లక్షల నిధులున్నా లీకై న పైపులకు మరమ్మతు ఎందుకు చేపట్టడంలేదని.. రైతుల గోస మీకు పట్టదా అని నాలుగు రోజుల్లో మరమ్మతు చేయించి పంటలకు నీరందించకుంటే ఆందోళనకు దిగుతామని ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ అన్నారు. మండలంలోని క్యాతూర్‌లోని క్యాతూర్ -2 లిఫ్ట్, పైపు లీకేజీలను గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. క్యాతూర్ లిఫ్ట్-2 ద్వారా వేల ఎకరాలకు నీరు పారాల్సి ఉండగా.. 400 ఎకరాలకు నీళ్లు పారి బంద్ అయ్యిందని, కళ్ల ముందు నదిలో నీరు ఉన్నా పంట పొలాల్లోకి వచ్చే పరిస్థితి లేదని, దీనంతటికి అధికారులు, ఎమ్మెల్యే నిర్లక్ష్యమేనని ఆరోపించారు. కమిటీలో రూ.35 లక్షల నిధులున్నా రూ.3 లక్షల నిధులతో పైపుల మరమ్మతు చేపట్టకపోవడం దారుణమని, కనీసం నాయకులు సైతం పగిలిన పైపులను పరిశీలించిన దాఖలాలు లేవన్నారు. ఈ సమస్యపై ఈఈ, ఏఈలతో మాట్లాడగా నాలుగు రోజుల్లో పనులు చేపడతామని చెప్పినట్లు తెలిపారు. 27, 28వ తేదీలోగా పనులు పూర్తి కాకపోతే అలంపూర్ చౌరస్తాలో వేలాది మంది రైతుల మద్దతుతో కలిసి ఆందోళనకు దిగుతామన్నారు. ఆయన వెంట చంద్రశేఖర్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, రాము, బలేశ్వర్ రెడ్డి, ప్రసాద్ గౌడ్, నర్సింహహ, వెంకటేష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగ క్వింటా రూ.7,411

గద్వాల వ్యవసాయం: గద్వాల మార్కెట్ యార్డుకు గురువారం 256 క్వింటాళ్ల వేరుశనగ వచ్చింది. క్వింటాలుకు గరిష్టం రూ.7411, కనిష్టం రూ. 4889, సరాసరి రూ. 5929 ధరలు లభించాయి.

ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధం



'నా భూమి నా దేశం' ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

- 18 ఏళ్లు నిండిన వారందరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలి
- కలెక్టర్ వల్లూరు క్రాంతి
- కళాశాల విద్యార్థులకు ఓటు వేసే విధానం ప్రత్యేక అవగాహన



ఓటింగ్ వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

గద్వాల రూరల్: ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధమని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. గురువారం ఐడీవోసీ కార్యాలయంలో ప్రైవేటు, ప్రభుత్వ, డిగ్రీ, ఇంటర్ కాలేజీ, కేజీవీబీ ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, విద్యార్థులకు ఓటువిలువ, ఓటు వినియోగంపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రానున్న అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ముసాయిదా ఓటరు జాబితాను ప్రచురించడం జరిగిందని, జాబితాలో మీపేర్లు చెక్ చేసుకోవాలన్నారు. పేర్లు లేకుంటే ఫాం-6 ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవచ్చన్నారు. నమోదు చేసుకునేందుకు సెప్టెంబర్ 12వ తేదీ వరకు గడువు ఉందని, ఇతర మార్పులు చేర్పులకు సంబంధించి కూడా అవకాశముందన్నారు. అనంతరం విద్యార్థులకు ఓటు వేసే విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అపూర్వ్ చౌహాన్, తహసీల్దార్లు హరికృష్ణ, జుబేర్, ఇంటర్మీడియట్ కోఆర్డినేటర్ హృదయరాజు, శ్రీపతినాయుడు, సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

10842 మంది గాంధీ చిత్రం వీక్షణ

విద్యార్థులలో జాతీయ భావాన్ని పెంచేందుకు ఉచితంగా గాంధీచిత్ర పదర్శన చేస్తున్నట్లు కలెక్టర్ క్రాంతి ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 10,842మంది విద్యార్థులు గాంధీ చిత్రాన్ని తిలకించారన్నారు.

ప్రతిఒక్కరూ దేశభక్తి కలిగి ఉండాలి

దేశం పట్ల ప్రతిఒక్కరూ విధేయత, దేశభక్తిని కలిగి ఉండాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. జిల్లాలోని 255గ్రామపంచాయతీల నుంచి తీసుకువచ్చిన మట్టిని కుండలో వేసి దానిని భద్రంగా ఢిల్లీలోని నెహ్రూ యువ జన కేంద్రంలోని అమృతవాటికలో ఆజాదికా అమృత్ మహోత్సవంగా మొక్కలు నాటేందుకు వినియోగిస్తారన్నారు. అనంతరం నాభూమి నాదేశం అనే ప్రతిజ్ఞను అందరి చేత చేయించారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రమేష్‌బాబు, డీఆర్‌డీఏ ఉమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

హామీల అమల్లో బీఆర్ఎస్, బీజేపీ విఫలం



బ్రోచర్లు విడుదల చేస్తున్న జెడ్పీచైర్‌పర్సన్ సరిత

గద్వాల అర్బన్: కేంద్రంలోని బిజేపీ, రాష్ట్రంలోని బీఆర్ఎస్ తోడు దొంగలని.. హామీల అమల్లో విఫలమయ్యాయని జెడ్పీ చైర్‌పర్సన్ సరిత వ్యాఖ్యానించారు. తిరగబడదాం-తరిమికోడదాం కార్యక్రమానికి సంబంధించి బ్రోచర్లను గురువారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ క్యాంపు కార్యాలయంలో ఆమె విడుదల చేసి మాట్లాడారు. అధికారాన్ని అడ్డం పెట్టుకొని సీఎం కేసీఆర్ ల్యాండ్, శాండ్, మైన్స్, వైన్స్ మాఫియాను నడిపిస్తున్నారని ఆరోపించారు. పేదలకు ఎకరం భూమి పంచకపోగా ఆసైన్డ్ భూములను అమ్మేస్తున్నారన్నారు. కాళేశ్వరం, ఇతర ప్రాజెక్టుల పేరుతో రూ.లక్ష కోట్ల దోచుకోని ప్రజలపై రూ.5లక్షల కోట్ల అప్పును మోపారని, సచివాలయం కోసం అడ్డగోలుగా ప్రజాధానాన్ని వృథా చేశారన్నారు. అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ తిరగబడుదాం -తరిమికోడుదాం అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. వచ్చే నెల వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని, గ్రామాల్లో కేంద్ర, రాష్ట్ర వైఫల్యాలు, అవినీతి అక్రమాలు, మోసాలను ప్రజలకు వివరిస్తామన్నారు. అలాగే పోస్ట్‌కార్డు ఉద్యమం నిర్వహించనున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బండ్ల చంద్రశేఖర్ రెడ్డి, లక్ష్మణ్, కృష్ణారెడ్డి, రవి, సురేష్, గోవిందు తదితరులు ఉన్నారు.



భారీ జాతీయ జెండాతో ర్యాలీ

చంద్రయాన్-3 విజయవంతం కావడం.. విక్రమ్ ల్యాండర్ నుంచి రోవర్ బయటికి వచ్చి చంద్రుడి దక్షిణ ధ్రువంపై కాలు మోపడంతో అలంపూర్‌లో పాఠశాల విద్యార్థులు గురువారం భారీ జాతీయ జెండాతో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. జయహో భారత్.. జయహో ఇస్రో అంటూ నినాదాలు చేశారు. – అలంపూర్

బాధితులకు న్యాయం చేయాలి



జాతీయ రహదారిపై సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచిస్తున్న ఎస్పీ సృజన

ఉండవెల్లి: సమస్యలతో పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ సృజన అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీలలో భాగంగా ఆమె పరిశీలించారు. స్టేషన్‌లో రికార్డులు, పరిసరాలు పరిశీలించారు. 5ఎస్ అమలు తీరును పర్యవేక్షించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఫిర్యాదులపై నిర్లక్ష్యం వహించవద్దని, సీసీ కెమెరాల ఆవశ్యకత, ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేయాలన్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, సంఘ విద్రోహ చర్యలు, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై చర్యలు తీసుకోవాలని, నిత్యం సమస్యలు సృష్టిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేసే వారిపై రౌడీషీట్ ఓపెన్ చేయ్యాలని ఆదేశించారు. జాతీయ రహదారిపై ప్రమాదాలను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా కేంద్రాలను ఏర్పాటు చేసి నిరంతరం తనిఖీలు నిర్వహించాలని, రానున్న ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అల్లర్లు జరగకుండా పలు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు.

ఎన్‌హెచ్‌పై ప్రమాదాలు అరికట్టేందుకు చర్యలు

అనంతరం ఎన్‌హెచ్-44ను పరిశీలించారు. రహదారిపై ప్రమాదాలను అరికట్టేందుకు సరైన జాగ్రత్తలు, సూచిక బోర్డులు ఏర్పాటు చెయ్యాలని సూచించారు. బ్లాక్ స్పాట్స్‌లో ప్రమాదాల నివారణకు సైన్ బోర్డులు, స్టాపర్స్‌ను ఏర్పాటుకు సూచనలు చేశారు. సరిహద్దు ప్రాంతం కావడంతో విస్తృతంగా తనిఖీలు చేయాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై, తగు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐ రాజు, ఎస్ఐలు బాల్‌రాజు, అరుణ, హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రపంచంతో పోటీపడి వస్త్రాలు తయారు చేయాలి

నారాయణపేట: ప్రపంచంతో పోటీ పడి కొత్త కొత్త డిజైన్లలో వస్త్రాలు తయారు చేయాలని.. పేట చీరలను ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి తెచ్చేందుకు చేనేత కార్మికులు కృషి చేయాలని రాష్ట్ర హ్యాండ్లూమ్ టెక్స్‌టైల్స్ డైరెక్టర్ అలుగు వర్షిణి అన్నారు. గురువారం జిల్లాకు చేరుకున్న ఆమె కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. రివ్యూ ఆన్ డిపార్ట్‌మెంటల్ స్కీమ్స్, మార్కెటింగ్ అండ్ ప్రొడక్షన్, సొసైటీ ప్రొక్యూర్మెంట్, నారాయణపేట పట్టణ చేనేత కార్మికుల స్థితిగతులు, సొసైటీల నిర్వహణ తదితర అంశాలపై చేనేత సొసైటీల నిర్వాహకులు, అధికారులతో మాట్లాడారు. సొసైటీలలో ప్రతి ఒక్క చేనేత కార్మికులు సభ్యత్వం కలిగి ఉండాలని, బ్యాంకు లింకేజీ ద్వారా చేనేత కార్మికులు పనులు చేసుకోవచ్చన్నారు. మాస్టర్ వీవర్స్ కొత్త డిజైన్ వస్తే రాష్ట్ర వ్యాప్తంగా సరైన రేటు నిర్ణయిస్తామని తెలిపారు. ప్రతి చేనేత కార్మికుడికి సొసైటీ అండగా ఉంటుందని జిల్లాలో చాలా మంది చేనేత కార్మికులు ఉన్నారని అందరూ సభ్యత్వం పొందాలన్నారు. సొసైటీకి 1/3 ఉంటే సహాయం చేస్తామని తెలిపారు. అనంతరం జిల్లాలో ఏడు చేనేత సొసైటీలలో మూడు పని చేయడం లేదని అధికారులు వివరించారు. అలాగే, కాంచీపురంలో చీరల శిక్షణ ఇవ్వాలని సొసైటీ వారు కోరగా..అందరూ సమ్మతిస్తే శిక్షణకు పంపుతామని డైరక్టర్ తెలిపారు.

పీహెచ్‌సీలో ఒకేరోజు 10 కాన్పులు



అయిజ: పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఒక రోజు వ్యవధిలో పది కాన్పులు నిర్వహించారు. బుధవారం మధ్యాహ్నం 12గంటల నుంచి గురువారం ఉదయం 6గంటల వరకు మొత్తం 10మంది మహిళలకు స్టాఫ్ నర్స్ జ్యోతి పురుడుపోసింది. అయిజ మండలం నుంచి 8మంది, ఇటిక్యాల, గద్వాల నుంచి మరో ఇద్దరు గర్భిణులు ప్రసవం నిమిత్తం బుధవారం అయిజ పీహెచ్‌సీకి చేరుకున్నారు. వీరందరికీ స్టాఫ్‌నర్స్ ప్రత్యేక చికిత్సలు నిర్వహించి అనంతరం కాన్పులు చేశారు. పది మంది శిశువుల్లో ఐదు మంది ఆడ, మరో ఐదు మంది మగ శిశువులు జన్మించారు. తల్లి, పిల్లలు అందరూ ఆరోగ్యంగా ఉన్నారు. అప్పుడే పుట్టిన శిశువులకు పీహెచ్‌సీ సిబ్బంది బీసీజీ టాకా, బర్త్ పోలియోడోస్, హెపటైటస్ బీ జీరో ఇంజక్షన్ ఇచ్చారు. ఒకేరోజు 10 కాన్పులు చేసిన స్టాఫ్‌నర్స్ జ్యోతిని మెడికల్ ఆఫీసర్ విష్ణు, ఇతర వైద్యులు, సిబ్బంది అభినందించారు.

పీహెచ్‌సీలో జన్మించిన 10 మంది శిశువులు

క్లుప్తంగా

జూరాల కాల్వలో యువకుడి గల్లంతు


నవీన్ (ఫైల్)

పెబ్బేరు రూరల్: పట్టణ సమీపంలోని జూరాల ప్రధాన కాల్వలో పడి ఓ యువకుడు గల్లంతైనట్లు ఎస్‌ఐ జగదీశ్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. పాన్‌గల్ మండలం బుసిరెడ్డిపల్లికి చెందిన భూదేవి, రాములుకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడు నవీన్ (22) కొంతకాలంగా హైదరాబాద్‌లో ఓ బిల్డర్ వద్ద సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. పెబ్బేరు అంబేడ్కర్‌నగర్‌లో ఉంటున్న బంధువుల ఇంట్లో జరిగే శుభకార్యానికి వచ్చిన నవీన్ బుధవారం అర్ధరాత్రి నలుగురు స్నేహితులతో కలిసి బహిర్భూమికి వెళ్లాడు. కాలకృత్యాలు తీర్చుకునేందుకు కాల్వలోకి దిగి కాలుజారి అందులో పడిపోయాడు. కేకేలు వేస్తుండగా పక్కనే ఉన్న స్నేహితులు రక్షించేందుకు ప్రయత్నించినా.. నీటి ఉధృతి అధికంగా ఉండటంతో కొట్టుకుపోయాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో షట్టర్లు మూసి నీటి సరఫరా నిలిపివేసి గాలింపు చర్యలు చేపట్టినా మృతదేహం లభ్యం కాలేదు. ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

ట్యాంకర్ కిందపడి చిన్నారి మృతి

వెల్దండ: మండలంలోని పెద్దాపూర్ శివారులో గురువారం ఉదయం వాటర్ ట్యాంకర్ కింద పండి మానస(2) మృతి చెందింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కోడేర్ మండలం నాగులపల్లితండాకు చెందిన రాత్లావత్ శివ కుటుంబంతో కలిసి ఓ వెంచర్‌లో పనులకు వచ్చారు. అక్కడే కుటుంబంతో నివాసం ఉంటున్నారు. గురువారం ఉదయం వాటర్ ట్యాంకర్‌తో నీళ్లు పడుతున్న సమయంలో చిన్నారి ప్రమాదవశాత్తు ట్యాంకర్ కింద పడింది. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ విషయంపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

యువకుడి బలవన్మరణం


మహేష్ (ఫైల్)

ఉండవెల్లి: ఆర్థికపరమైన ఇబ్బందులతో ఓ యువకుడు పురుగు మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఎస్‌ఐ బాలరాజు కథనం ప్రకారం.. ఉండవెల్లికి చెందిన మహేష్(29), హేమలతలకు ముగ్గురు సంతానం. మహేష్ 8 నెలల క్రితం ఒక ట్రాక్టర్, ఒక మొక్కజొన్నల పెద్ద మిషన్ (హార్వెస్టింగ్ యంత్రం) తీసుకొచ్చారు. ప్రస్తుతం కిరాయిలు లేకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదురయ్యాయి. దీంతో గురువారం ఇంట్లో ఉన్న పురుగు మందు తాగి అపస్మారక స్థితికి చేరుకోగా. భార్య హేమలత గమనించి చుట్టుపక్కల సాయంతో 108లో కర్నూలు ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. ఈ ఘటనపై మహేష్ భార్య హేమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అనారోగ్య సమస్యలతో మహిళ..


ఉషారాణి (ఫైల్)

ధరూరు: అనారోగ్య సమస్యలు, కుటుంబ ఆర్థిక పరిస్థితులతో ఓ వివాహిత ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని ర్యాలంపాడులో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మధుసూదన్‌రెడ్డి భార్య ఉషారాణి(28) కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. దీంతోపాటు ఇటీవల కుటుంబం అప్పుల పాలు కావడం వంటి సమస్యల కారణంగా గురువారం తెల్లవారుజామున ఇంట్లో అందరూ నిద్రిస్తుండగా ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు కాపాడే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. మృతురాలికి భర్తతోపాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. తల్లి శివమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివానందంగౌడ్ తెలిపారు.

ఎదురు తిరిగాడని.. అంతమొందించాడు

- హత్య కేసులో నిందితుడికి రిమాండ్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ రమేశ్‌బాబు, వెనక నిందితుడు బాలస్వామి

జడ్చర్ల: తనకు ఎదురు తిరగడమే గాక కులంలో తక్కువ చేసే విధంగా వ్యవహరిస్తున్న వ్యక్తిని కర్రతో చితకబాది అంతమొందించిన నిందితుడిని గురువారం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హత్య కేసుకు సంబంధించిన వివరాలను సీఐ రమేశ్‌బాబు వెల్లడించారు. బాదేపల్లి పాతబజార్‌కు చెందిన మీనుగ బాలయ్య(30) నిందితుడు మీనుగ బాలస్వామి వరుసకు సోదరులు. అయితే బాలయ్య కొంతకాలంగా కోళ్లను దొంగిలించి అమ్ముకుని మద్యం తాగేవాడు. దీంతో కోళ్ల యజమానులు మీనుగ బాలస్వామికి ఫిర్యాదు చేయడంతో పలుమార్లు తమ్ముడిని మందలించాడు. అయినా దొంగతనం మానకపోవడంతో పాటు తన కోళ్లను సైతం దొంగిలించాడు. తన కోళ్లను ఎందుకు దొంగిలించావని, కోళ్ల దొంగతనం ఆపాలని హెచ్చరించగా ఎదురుతిరిగాడు. తనకు బాహాటంగా ఎదురుతిరగడంతో కులంలో పెద్దరికంగా వ్యవహరిస్తున్న తన పలుకుబడికి విలువ లేకుండా పోతుందని, బాలస్వామి బాలయ్యను అంతమొందిస్తే కులంలో తనకు అందరూ భయపడతారని భావించాడు. ఈ నెల 14న రాత్రి తన గుడిసె వద్దకు వచ్చిన బాలయ్యతో గొడవపడి కర్రతో తీవ్రంగా చితకబాదాడు. గాయపడిన బాలయ్య తన ఇంటికి వెళ్లి మరుసటిరోజు మృతి చెందాడు. బాలయ్యను తాను కొట్టిన విషయం ఎవరికీ చెప్పవద్దని అతని భార్య మీనుగ నాగలక్ష్మిని సైతం బెదిరించాడు. దీంతో నాగలక్ష్మి పోలీసులకు తన భర్త అనారోగ్యంతో మృతిచెందాడని తెలిపింది. అయితే డాక్టర్లు పోస్టుమార్టం సమయంలో తీవ్ర గాయాలతో మృతి చెందినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అసలు విషయం బయటపడగా.. బాలయ్య భార్యతో ఫిర్యాదు తీసుకుని హత్య కేసుగా నమోదు చేశారు. తనపై హత్య కేసు నమోదైన విషయం తెలుసుకున్న నిందితుడు బాలస్వామి గురువారం మధ్యవర్తి ద్వారా నేరం ఒప్పుకొని పోలీసులకు లొంగిపోయాడు. కాగా నిందితుడు గతంలో నాగసాల వద్ద జరిగిన జంట హత్యల కేసులో ప్రధాన నిందితుడుగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. హత్యకు వినియోగించిన కర్రను స్వాధీనపర్చుకుని నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో ఎస్‌ఐలు చంద్రమోహన్, నాగరాజు పాల్గొన్నారు.

విద్యుత్ కోతలపై రైతుల ఆగ్రహం


ఇందువాసి సబ్ స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

- గట్టు, ఇందువాసి సబ్‌స్టేషన్ల వద్ద రైతుల ఆందోళన

గట్టు: వర్షాకాలంలో ఎడాపెడా విద్యుత్ కోతల నేపథ్యంలో గురువారం మండల కేంద్రం, ఇందువాసి విద్యుత్ సబ్‌స్టేషన్ల వద్ద రైతులు ఆందోళన నిర్వహించారు. గురువారం వ్యవసాయ అవసరాలకు సరఫరా పూర్తిగా తగ్గించడంతో మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ వద్దకు మండల కేంద్రంతో పాటు గంగిమాన్‌దొడ్డి, యల్లందొడ్డి, మాచర్ల వైపు పొలాలు ఉన్న రైతులు సబ్‌స్టేషన్‌కు చేరుకున్నారు. కొంతమంది రైతులు వరినాట్లు వేసుకోగా, మరికొందరు ఇంకా నాట్లు వేసుకునే పనిలో పడ్డారు. మిరపను కూడా నాటుకునే పనిలో మరి రైతులు నిమగ్నమయ్యారు. వర్షాకాలం (ఆగస్టులో) కరెంట్ కోతలు విధించడం ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. వర్షాకాలంలో వానలకు రైతులు బోర్లు, కాల్వల ద్వారా నీటి వసతి కలిగిన రైతులు వరి నాట్లతో పాటుగా వేరుశనగ, మిరప, పత్తి పంటలను సాగు చేసుకున్నారు. వర్షాలు అంతంత మాత్రం ఉండడంతో రైతులు పూర్తిగా బోర్లు, కాల్వల నీటిపైనే ఆధారపడ్డారు. కరెంట్ రెండు గంటలు కూడా సక్రమంగా నడవడం లేదంటూ రైతులు వాపోయారు. ఏఈ చిన్నయ్యను వివరణ కోరగా విద్యుత్ వినియోగం పెరగడంతో పై నుంచే సరఫరాను నిలిపి వేస్తున్నట్లు సమాధానమిచ్చారు. బోయలగూడెం వైపు వెళ్తున్న మాజీ ఎమ్మెల్యే భరత సింహారెడ్డి రైతులు ఆందోళన చేస్తున్న విషయం తెలుసుకుని, విద్యుత్ సబ్‌స్టేషన్ వద్దకు చేరుకున్నారు. విద్యుత్ కోతల విషయాన్ని రైతులు ఆయన దృష్టికి తీసుకురాగా, ఆయన గద్వాల ఏడీతో మాట్లాడి, రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

రాజకీయాలపైనే కేసీఆర్ దృష్టి

- మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత నాగం జనార్దన్‌రెడ్డి విమర్శ


మాట్లాడుతున్న నాగం జనార్దన్‌రెడ్డి

కందనూలు: ప్రజలు ఛీకొడుతున్నా.. సీఎం కేసీఆర్ పాలనను గాలికొదిలేసి.. కేవలం రాజకీయాలపైనే దృష్టిపెట్టారని మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత నాగం జనార్దన్‌రెడ్డి విమర్శించారు. గురువారం జిల్లాకేంద్రంలోని తన నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వర్షాలు పడక రైతులు గోస పడుతుంటే.. కేసీఆర్ రాజకీయాలు చేయడం సిగ్గుచేటన్నారు. పూత పట్టే దశలో పత్తి, ఎదిగే దశలో మొక్కజొన్న, కంది ఇతర పంటలు ఉన్నాయని, ఎండల తీవ్రతతో అవి వాడిపోయి.. ఎండిపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ ద్వారా నీటిని విడుదల చేయకపోవడంతో పంటలకు నీరు అందక అనేక అవస్థలు పడుతున్నారని, దీనికి ప్రజాప్రతినిధులే బాధ్యత వహించాలన్నారు. తొమ్మిదేళ్ల కేసీఆర్ పాలనలో ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని, విద్యార్థులకు గత ప్రభుత్వం మంజూరు చేసిన ఫీజు రీయంబర్స్‌మెంట్‌ను అమలు చేయకపోవడం వల్ల ఎంతోమంది పేద విద్యార్థులు చదువుకు దూరమయ్యే పరిస్థితి దాపురించిందన్నారు. నోటిఫికేషన్లు లేక లక్షలాది మంది రోడ్లపై తిరుగుతున్నారని, నిరుద్యోగులు అంటే ఎందుకంత కోపమని ప్రశ్నించారు. ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డికి ఓటమి భయం పట్టుకుందని, అందులో భాగంగానే చేరికల డ్రామా ఆడుతున్నారని ఆరోపించారు. రుణమాఫీ కాకుండా.. రైతులను రుణ విముక్తులు చేయాలన్నారు. ప్రజల పన్నులతో ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలను సొంత పార్టీ కార్యకర్తలకు అప్పగించి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని దుయ్యబట్టారు. తాను మంత్రిగా ఉన్న సమయంలో రూ.2.50 కోట్లతో కలెక్టర్ నిర్మిస్తే.. ప్రస్తుత కలెక్టరేట్‌ను రూ.54 కోట్లతో నిర్మించాలని, ఇందులో పూర్తిస్థాయిలో అవినీతి అక్రమాలు జరిగాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో సీనియర్ నాయకులు నాగం శశిధర్‌రెడ్డి, మున్సిపాలిటీ అధ్యక్షుడు పాండు, నారాయణగౌడ్, సుధాకర్, దామోదర్, అహ్మద్‌పాషా, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

చంద్రయాన్-3లో కత్తేపల్లి వాసి


చంద్రయాన్-3 రాకెట్ వద్ద అఫ్రోజ్

ఆత్మకూర్: చంద్రుడిపై చంద్రయాన్-3 విజయవంతంగా కాలు మోపిన వేళ యావత్ ప్రపంచంలోనే భారత్ ఆదర్శంగా నిలిచిన సందర్భంగా సంబురాలు మిన్నంటాయి. చంద్రయాన్-3 విజయంలో ఆత్మకూర్ మండలం కత్తేపల్లికి చెందిన మహమ్మద్ అఫ్రోజ్ భాగస్వామ్యం కావడంతో జాతీయ జెండాలతో గ్రామస్తులు సంబరాలు జరుపుకొన్నారు. గ్రామానికి చెందిన ఎండీ తురాబ్‌అలీ, రెహానాబేగం పెద్ద కుమారుడు అఫ్రోజ్ 2019లో నెల్లూర్‌లోని శ్రీహరికోటలో ఇంజినీర్‌గా చేరాడు. చంద్రయాన్-3లో సాలిడ్ రాకెట్‌ను తీసుకెళ్లే మోటార్స్, బూస్టర్స్ డివిజన్ ఎస్-200 (సిస్టం రియాలిబిలిటీ) క్వాలిటీ ఇంజినీర్‌గా పనిచేశాడు. ఆయన 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. ఆదిత్య ఎల్-1 రాకెట్‌ను లాంచింగ్‌కు పూర్తిస్థాయిలో సిద్ధం చేశామని సెప్టెంబర్ 2న ఆదిత్య ఎల్-1 రాకెట్ సైతం విజయవంతమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

టూడేస్ లీగ్‌లో పాలమూరు విజయం


జిల్లా క్రికెట్‌జట్టుతో రాజశేఖర్, కోచ్ అబ్దుల్లా

మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్‌లో జరుగుతున్న హెచ్‌సీఏ బీ–డివిజన్ టూ డే లీగ్ చాంపియన్‌షిప్ లీగ్‌లో గురువారం జరిగిన మ్యాచ్‌లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా క్రికెట్ జట్టు విజయం సాధించింది. న్యూబ్లూస్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో 9 వికెట్ల తేడాతో నెగ్గింది. తొలుత బ్యాటింగ్ చేసిన న్యూబ్లూస్ జట్టు జిల్లా బౌలర్ల ధాటికి వరుసగా వికెట్లను కోల్పోయి 38.4 ఓవర్లలో 93 పరుగులకు ఆలౌట్ అయింది. కె.అనిల్, మహ్మద్ ముఖిత్, మహ్మద్ షాదాబ్ అహ్మద్ మూడేసి వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన జిల్లా జట్టు 12 ఓవర్లలో వికెట్ కోల్పోయి లక్ష్యాన్ని చేరుకుంది. ఓపెన్ ఎ.శ్రీకాంత్ (41 బంతుల్లో 9 ఫోర్లు, సిక్స్‌తో 51 పరుగులు) అర్ధసెంచరీతో రాణించగా.. డేవిడ్ క్రిపాల్ (23 పరుగులు) నాటౌట్‌గా నిలిచారు. హెచ్‌సీఏ టూడేస్ లీగ్ మ్యాచ్‌లో జిల్లా క్రికెట్ జట్టు విజయం సాధించడంపై మహబూబ్‌నగర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్ అభినందించారు. కార్యక్రమంలో కోచ్ అబ్దుల్లా పాల్గొన్నారు.

బైక్, లారీ ఢీ : వ్యక్తి దుర్మరణం

ఎర్రవల్లిచౌరస్తా: బైక్, లారీ ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన ఇటిక్యాల మండలం జింకలపల్లి సమీపంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ అశోక్‌బాబు కథనం మేరకు.. మండలంలోని కొండేరుకు చెందిన చంద్రశేఖర్ తన సోదరుడు ఈశ్వర్ (38)తో కలిసి బైక్‌పై ఇటిక్యాలలోని బంధువుల ఇంట్లో జరిగే శుభకార్యానికి బయలుదేరారు. జాతీయ రహదారిపై జింకలపల్లి సమీపంలో ఎస్‌ఎన్‌ఎస్ కంపెనీ వైపు రహదారి దాటుతుండగా లారీ బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ఈశ్వర్‌కు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. బాధితుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు. డ్రైవర్ ఘటన స్థలంలోనే లారీని వదిలేసి పరారైనట్లు స్థానికులు తెలిపారు.

చికిత్స పొందుతూ మరొకరు..

శాంతినగర్: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి గురువారం మృతిచెందినట్లు ఎస్‌ఐ నరేష్ తెలిపారు. రాజోళి మండలం ముండ్లదిన్నెకు చెందిన ఏసన్న ఈ నెల 14న బైక్‌పై శాంతినగర్‌కు వచ్చి తిరిగి గ్రామానికి వెళ్తుండగా వడ్డేపల్లి మండలం వెంకట్రామనగర్ సమీపంలో నర్సరీ వద్ద వాహనం అదుపుతప్పి కిందపడటంతో గాయాలయ్యాయి. కుటుంబసభ్యులు వెంటనే 108 వాహనంలో కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతిచెందాడు. భార్య మాధవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

యువకుడిపై చర్యలు తీసుకోవాలని ధర్నా

కొత్తకోట రూరల్: యువకుడి వేధింపులతోనే విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిందని యువతి తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళన చేపట్టారు. పట్టణానికి చెందిన గోపాల్, లక్ష్మి దంపతుల కూతురు శ్రావణి(19) హైదరాబాద్‌లోని మేడ్చల్‌లో గల బీసీ హాస్టల్‌లో ఉంటూ సీఎంఆర్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. బుధవారం మధ్యాహ్నం హాస్టల్ గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. హాస్టల్ సిబ్బంది సమాచారంతో హైదరాబాద్ చేరుకున్న శ్రావణి కుటుంబ సభ్యులు ఆత్మహత్యకు గల కారణాలను తెలుసుకున్నారు. అయితే కొత్తకోటకే చెందిన ఓ యువకుడు ప్రేమిస్తున్నానంటూ కొంతకాలంగా వేధిస్తుంటంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్టు కుటుంబ సభ్యులు ఆరోపిస్తూ గురువారం విద్యార్థి సంఘాల నాయకులతో కలిసి మృతదేహాన్ని కొత్తకోట చౌరస్తాలో ఉంచి ధర్నా చేపట్టారు. శ్రావణి ఆత్మహత్యకు కారణమైన యువకుడిని కఠినంగా శిక్షించాలని గంటపాటు ధర్నా చేయడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. దీంతో ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి శ్రావణి బంధువులతో మాట్లాడి ఆరోపిస్తున్న యువకుడిని అదుపులోకి తీసుకుని విచారించి తగిన చర్యలు తీసుకుంటామని చెప్పడంతో ధర్నాను విరమించారు.

ప్రమాదవశాత్తు గుడిసె దగ్ధం

గండీడ్: ప్రమాదవశాత్తు గుడిసెకు నిప్పంటుకొని ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. దీంతోపాటు ఐదు గేదెలు సైతం తీవ్రంగా గాయపడిన సంఘటన మండలంలోని వెన్నాచేడ్‌లో గురువారం రాత్రి చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన చల్లరాజు గురువారం రాత్రి 7 గంటల ప్రాంతంలో గేదెలను పశువుల పాకలో కట్టేసి.. దోమల బారిన పడకుండా పాకలో పొగ పెట్టాడు. అది కొద్ది కొద్దిగా మంట పెద్దగా మారి గుడిసెకు మంటలు వ్యాపించాయి. ఒక్కసారిగా మంటలు ఎగసిపడటంతో పైనున్న విద్యుత్ వైర్లు తెగిపడి మంటలు వ్యాప్తిచెందాయి. పాక ఊరికి దగ్గరగా ఉండడంతో విషయాన్ని గమనించిన స్థానికులు అక్కడికి చేరుకొని మంటలు ఆర్పారు. పాకలో ఉన్న గేదెలను తప్పించి బయటికి కొట్టారు. ఈ ప్రమాదంలో రాజుతోపాటు మరో యువకుడు స్వల్పంగా గాయపడ్డారు. పాకలో ఉన్న మూడు పెద్ద గేదెలు రెండు చిన్నవి తీవ్రంగా గాయపడ్డాయి.

నెట్టెంపాడుకు నీటి పంపింగ్

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు గురువారం 4 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. నెట్టెంపాడుకు ఒక పంపు ద్వారా 750 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. ఆవిరి రూపంలో 111 క్యూసెక్కులు, భీమా లిఫ్టు–1 ద్వారా 650 క్యూసెక్కులు, కోయిల్‌సాగర్‌కు 315 క్యూసెక్కులు, జూరాల ఎడమ కాల్వ ద్వారా 1,030 క్యూసెక్కులు, కుడి కాల్వకు 738 క్యూసెక్కులు, ఆర్‌డీఎస్ లింక్ కెనాల్‌కు 100 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం 3,594 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 7.875 టీఎంసీల నీరు నిల్వ ఉంచారు.

రామన్‌పాడుకు 1,130 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

మదనాపురం: రామన్‌పాడు జలశయానికి గురువారం 1,130 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటిమట్టం 1,020అడుగులకు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 1.030 క్యూసెక్కులు, సమాంతర కాల్వ ద్వారా 100 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. ఎన్‌టీఆర్ కాల్వ ద్వారా వ్యవసాయ అవసరాల కోసం 950 క్యూసెక్కులు కుడి, ఎడమ, కాల్వ ద్వారా 20 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నారు. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని ఏఈ రసీల్‌రెడ్డి తెలిపారు.

శ్రీశైలంలో 856.8 అడుగుల నీటిమట్టం

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో గురువారం 856.8 అడుగుల నీటిమట్టం, 96.4964 టీఎంసీల నీటి నిల్వ ఉంది. 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 7,000, ముచ్చుమర్రి నుంచి కేసీ కెనాల్‌కు 490, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్‌కు 2,025, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్‌ఐకు 2,026 క్యూసెక్కుల నీటిని వదిలారు. భూగర్భ కేంద్రంలో 2.229 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేసి 7,132 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు.

నిరుపేద విద్యార్థి ప్రతిభ

- ఏఎంఈసెట్‌లో ఆలిండియా 158వ ర్యాంక్
- కమర్షియల్ పైలెట్ కోర్సులో సీటు
- రూ.35.23 లక్షల ఫీజు చెల్లించడానికి రాష్ట్ర ప్రభుత్వం చేయూత


విద్యార్థి అస్రార్ అమీర్‌ను అభినందిస్తున్న హోంమంత్రి మహమూద్‌అలీ

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లాకేంద్రంలోని ఫైర్‌స్టేషన్ (టీడీగుట్ట) నిరుపేద కుటుంబానికి చెందిన మహ్మద్ అస్రార్ అమీర్ మొదటి నుంచి చదువులో ప్రతిభచాటాడు. 7 నుంచి 10వ తరగతి వరకు జిల్లా కేంద్రంలోని మైనార్టీ బాలుర-2 గురుకులంలో, పదో తరగతిలో 10 గ్రేడ్ పాయింట్లు, బాలుర-1 జూనియర్ కళాశాలలో ఎంపీసీ ఇంటర్‌లో 931 మార్కులు సాధించి సత్తాచాటాడు. చిన్నప్పటి నుంచి విమానాలు నడపాలనే అభిరుచి పెంచుకున్న అస్రార్ అమీర్ ఈ ఏడాది జూలైలో ఎయిర్ క్రాఫ్ట్ మెయింటెనెన్స్ ఇంజినీరింగ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏఎంఈసెట్) పరీక్ష రాయగా ఆలిండియా స్థాయిలో 158 ర్యాంక్‌ను సాధించి హైదరాబాద్ బేగంపేటలోని రాజీవ్‌గాంధీ ఏవియేషన్ అకాడమీలో కమర్షియల్ పైలెట్ లైసెన్స్ కోర్సులో సీటు సంపాదించాడు.

రాష్ట్ర ప్రభుత్వం సహకారం

కమర్షియల్ పైలెట్ కోర్సులో సీటు సాధించిన విద్యార్థి మహ్మద్ అస్రార్ అమీన్‌ను జిల్లా కేంద్రంలో గురువారం బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు మోసీన్‌ఖాన్ సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి అస్రార్ పైలెట్ కోర్సులో సీటు సాధించినందుకు సంతోషంగా ఉందన్నారు. అయితే రెండేళ్ల కోర్సుకు రూ.35.23 లక్షలు ఫీజుగా ఉండడంతో అసలే నిరుపేద కుటుంబమైన అస్రార్ అంత డబ్బు చెల్లించలేని పరిస్థితి. దీంతో హోంమంత్రి మహమూద్‌అలీ, మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ల దృష్టికి విషయాన్ని తీసుకెళ్లినట్లు తెలిపారు. హోంమంత్రి సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. విద్యార్థి పైలెట్ కోర్సు ఫీజు రూ.35.23 లక్షలు రాష్ట్ర మైనార్టీ సంక్షేమశాఖ మంజూరు చేసినట్లు ప్రకటించారు. ఇప్పటికే మొదటి విడతగా ఏవియేషన్ అకాడమీకి రూ.10 లక్షలు చెల్లించి అడ్మిషన్ తీసుకోవడం జరిగిందన్నారు. మిగతా డబ్బులు రెండు విడతల్లో అకాడమీలో జమచేస్తారని పేర్కొన్నారు. పైలెట్ కావాలనుకున్న నిరుపేద విద్యార్థికి చేయూత అందించిన సీఎం కేసీఆర్, మంత్రులు మహమూద్‌అలీ, శ్రీనివాస్‌గౌడ్, మైనార్టీ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఉమర్ జలీల్, టీఎస్‌ఎంఎఫ్‌సీ చైర్మన్ ఇంతియాజ్ ఇసాక్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థి అస్రార్ అమీర్ మాట్లాడుతూ చిన్నప్పటి నుంచి పైలెట్ కావాలనే ఆశ ఉండేదని, ట్రైనింగ్ కోర్సు చేయడానికి తోడ్పాటు అందిస్తున్న సీఎం కేసీఆర్, మంత్రులు మహమూద్‌అలీ, శ్రీనివాస్‌గౌడ్, నాయకుడు మోసీన్‌ఖాన్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకుడు ఇద్రీస్ తదితరులు పాల్గొన్నారు.

VIJAYA DIAGNOSTIC CENTRE
Hiring for Mahabubnagar
WALK-IN
25 & 26 August, 2023 (Friday & Saturday)
Time: 10:00 am - 4:30 pm

- Sample Collection [Phlebotomists] (Exp. 2 years & Above) - DMLT / MLT / B.Sc-MLT
- X-Ray Technicians Male/Female (Exp. 1 year & Above) - DMIT / B.Sc-Radiology
- Branch Manager (Min Exp. 4 to 8 years in Health care) - Graduate / Post Graduate
- CT & MRI Technicians (Exp. 6 to 9 years) - (DMIT / B.Sc-Radiology)
- Front Office Executives (Min Exp. 1 to 2 years) - Any Graduate / Post Graduate
- Lab Technicians - Bio Chemistry / Haematology / Clinical Pathology / Microbiology (Exp. 2 to 10 years)
- Typists (Relevant Exp. 3 to 5 years) - Graduate / Post Graduate
- Patient Relationship Executives (Exp. 2 to 5 years) - Graduate / Post Graduate
- Staff Nurses (Min Exp. 1 to 3 years) GNM / B.Sc-Staff Nurse
- Ultrasound Assistants - Female (Fresher or 1 to 2 years experience) Inter / Graduate
- House Keeping Supervisors (Exp. 2 to 5 years) Graduate
- Electricians (Exp. 2 to 5 years) - ITI-Electrician
- Consultant Pathologists (Exp. 2 plus years) - MD / DNB Pathology
- Consultant Biochemists Exp. 2 plus years) - MD-Biochemistry
- Consultant Radiologists (Exp. 2 plus years) - MD / DNB / DMRD-Radiology
- Audit Executives (Exp. 2 to 4 years) - Graduate / Post Graduate
- Maintenance Supervisors (Exp. 2 to 5 years) - ITI-Electrician
- Sales and Marketing Executives (Exp. 3 to 6 years) Graduate / Post Graduate
- Executives-Stores and Procurement (Exp. 2 to 5 years) - Graduate / Post Graduate
- Ambulance Drivers (Exp. 2 to 3 years) - Required Badge Number

Please carry your Photograph, Educational & Experience Certificates.
1st Floor, Kritunga Restaurant, Shree 9 Complex, Opp: TRS Party Office, New Town, Rajendranagar, Mahabubnagar - 509001.
Ph: +91 91000 96499, 91004 45367
Email: careers@vijayadiagnostic.in NO NIGHT SHIFTS

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES
■ శ్రీ రామ్ గోల్డ్ మీ బంగారం తాకట్టులో ఉందా? వడ్డీ చెల్లించ లేకపోతున్నారా? తాకట్టులో ఉన్న బంగారం విడిపించి ఈ రోజు మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్ 9133214214

BUSINESS OFFER
■ Sipra కంపెనీ ప్రైవేట్ అన్ని రకములైన బిజినెస్ ప్రాపర్టీ ప్రాజెక్టు కొరకు LAP & Agent's కావలెను. మంచి జీతం+కమీషన్. Cell: 9990752820.

WANTED
■ మీ మొబైల్ ద్వారా మా కంపెనీ అడ్వర్టైజ్‌మెంట్ పంపుతూ వారం వారం అధిక ఆదాయం పొందండి. మీ అడ్రస్ వాట్సప్ చేయండి. వివరాలకు కాల్ చేయండి. 86798 33520, 90666 33520.
■ రేమండ్ షోరూమ్, జడ్చర్ల, నాగర్‌కర్నూల్ వనపర్తిలో పని చేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్ స్టోర్ ఇంఛార్జ్, సేల్స్ ఇంఛార్జ్ కావలెను. సెల్: 9492801999, 08543796686.
■ నర్మద హోండా షోరూం వనపర్తిలో పని చేయుటకు Field Manager, Sales Executives, Field Sales Executives, Service Supervisor, Mechanics, Parts Incharge, కావలెను. సెల్: 9440435060.
■ మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల ఫార్మా కంపెనీలో సెక్యూరిటీ గార్డులు కావలెను. జీతం: 13,000/- ESI, PF కలదు. భోజనం మరియు ఉచిత వసతి. Ph: 6300661014

సాక్షి క్లాసిఫైడ్స్
ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు
నాలుగు లైన్లకు రూ. : 200/- (Black & White)
అదనపు లైనుకు రూ. : 50
5% GST అదనం మాత్రమే
వివరాలకు :
మహబూబ్‌నగర్ : 9010234478
9010522215
9705135557
9010869797
జడ్చర్ల : 9010076222
నాగర్‌కర్నూల్ : 9010006785
వనపర్తి : 9010068317
గద్వాల : 9553955603
నారాయణపేట : 9010962007

సాక్షి భవిత విద్యార్థుల కోసం

గమనిక
- సాక్షి మేనేజర్